
సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 41,082 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 82,027 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



సీజేఐపై దాడి హేయం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ సిద్దెల జయరాజ్ మాదిగ అన్నారు. -8లో▸

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళాలు




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి సోమవారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. విశాఖపట్నంకు చెందిన వసంత రామారావు కుటుంబం నిత్యాన్నదానానికి రూ.1,01,700, కంకిపాడుకు చెందిన తుమ్మల చంద్రశేఖర్‌రావు కుటుంబం రూ.1,01,116 విరాళాలు ఆలయ అధికారులకు అందజేశాయి. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

తొమ్మిదో రోజు కొనసాగిన పీహెచ్‌సీ వైద్యుల దీక్ష



లబ్బీపేట(విజయవాడతూర్పు): దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన రిలే దీక్షలు తొమ్మిదో రోజు కొనసాగాయి. రిలే దీక్షల్లో సోమవారం పెద్ద సంఖ్యలో మహిళా వైద్యులు పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై మహిళా వైద్యులు గళం విప్పారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. కొందరు మహిళా వైద్యులు నినాదాలు, పాటలతో తమ నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఖరిపై ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది. ఈ రిలే దీక్షల్లో 500 మందికి పైగా మహిళా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు డాక్టర్ రవీంద్రనాయక్, డాక్టర్ వినోద్ మాట్లాడుతూ వైద్యులుగా పని చేస్తూ పదోన్నతులు, వేతనాలు విషయంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6.40, 9.30, 10.30 గంటలకు రుద్రాభిషేకం చేపట్టారు. ఉదయం 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి ఏడు గంటలకు పంచహారతులు, స్వామివారికి పల్లకీ సేవ అత్యంత వైభవంగా చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

23న జిల్లా స్థాయి యువజనోత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతలో కళా నైపుణ్యం, జాతీయ భావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఎన్టీఆర్ జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరగనున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లోని శ్రీపింగళి వెంకయ్య సమావేశమందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సోమవారం యువజనోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 2025, సెప్టెంబర్ 1 నాటికి 15–29 ఏళ్ల వయసు కలిగిన, జిల్లా స్థానికత ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వికసిత్ భారత్ జిల్లా స్థాయి – కల్చరల్ అండ్ ఇన్నోవేషన్ ట్రాక్ విభాగంలో ఫోక్ డ్యాన్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పొయెట్రీ, డిక్లమేషన్, ఇన్నోవేషన్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23వ తేదీ ఉదయం పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

సర్కారు వారి నకిలీలలుపై ఆగ్రహజ్వాల

ఎక్సైజ్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు

- నకిలీ మద్యాన్ని అరికట్టి, బెల్ట్‌షాపులను తొలగించాలని డిమాండ్
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని ధ్వజమెత్తిన మహిళలు
- జోరువానలో నినాదాలతో హోరెత్తిన ఎక్సైజ్ కార్యాలయాలు



మచిలీపట్నంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, నాయకులు, కార్యకర్తలు

చిలకలపూడి(మచిలీపట్నం): కూటమి ప్రభుత్వ హయాంలో జోరుగా సాగుతున్న నకిలీ మద్యం తయారీపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన నిరసన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. గ్రామాల్లో వీధివీధినా బెల్టు షాపుల ఏర్పాటు, నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నిరసనలతో పాటు నినాదాలతో హోరెత్తించారు. నకిలీ, కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని కూటమి ప్రభుత్వంపై మహిళలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ నేతల కనుసన్నల్లోనే నకిలీ మద్యం తయారు చేసి నేరుగా హోటళ్లు, దాబాలు, బెల్టుషాపులు, రోడ్ల పక్కన బడ్డీకొట్లలో సైతం విక్రయాలు చేపట్టడం దారుణమన్నారు. నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమగా తయారుచేసి ప్రోత్సహిస్తున్నారని, కల్తీ మద్యంతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నకిలీ మద్యం ద్వారా కూటమి నాయకులు రూ.కోట్లు గడిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కల్తీ మద్యం వల్ల ఇప్పటికే ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, చాలా మంది అనారోగ్యం పాలయ్యారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా నకిలీ మద్యం తయారీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, మహిళల తాళిబొట్లు తెంచొద్దని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కృష్ణా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచనలతో ఎక్సైజ్ శాఖ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి.

- మచిలీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జోరువాన పడుతున్నప్పటికీ లెక్క చేయకుండా కార్యాలయం వద్ద ప్లకార్డులతో నినాదాలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని నేతృత్వంలో కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మహిళా కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- పామర్రు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైలే అనిల్‌కుమార్ నేతృత్వంలో మొవ్వ ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి భారీగా ర్యాలీగా తరలివెళ్లి నిరసన ప్రదర్శన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి అశోక్‌కుమార్, గోగం సురేష్, రాజులపాటి రాఘవరావు, రాజులపాటి పార్వతి, జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమళ్ల రమాదేవి, నడకుదుటి రాజేంద్ర, బోళ్ల సోమేశ్వరరావు, సజ్జా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.
- పెడన నియోజకవర్గ పరిధిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా పెడన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జెడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్, మైలా రత్నకుమారి, ఎంపీపీలు సంగా మధుసూదనరావు, రాజులపాటి కళ్యాణి, కారుమంచి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో ఉయ్యూరులోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్ద కల్తీ మద్యానికి సంబంధించి కారకులను అదుపులోకి తీసుకుని శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి రామినేని రమాదేవి, ప్రచార కార్యదర్శి ప్రతివాడ రాఘవరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింహాద్రి రమేష్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నినాదాలు చేసి అనంతరం సీఐ గిరిజా కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం



“ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. మంచినీరు దొరకని గ్రామాలు ఉన్నాయే గానీ మద్యం దొరకని ఊళ్లు లేవు. ప్రతి గ్రామంలో కూటమి నాయకులే బెల్టు షాపులు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

– కందుల దుర్గాకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు, నందివాడ, కృష్ణాజిల్లా

నకిలీ మద్యాన్ని అరికట్టాలి



“ రాష్ట్రంలో నకిలీ మద్యం యథేచ్ఛగా తయారవుతోంది. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూస్తోంది. రాష్ట్ర రాజధాని అమరావతికి దగ్గరలోనే నకిలీ మద్యం తయారీ మూలాలను గుర్తించడం గమనార్హం. కల్తీ మద్యం తయారీదారులపై కూటమి ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి. మద్యం కల్తీని రూపుమాపేలా ఆ చర్యలు ఉండాలి.

– రాజులపాటి పార్వతి, జెడ్పీటీసీ, మొవ్వ, కృష్ణాజిల్లా

కల్తీ మద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం



“ కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యానికి చోటు లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యాన్నే ఆదాయంగా మార్చుకుంది. ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించింది. కూటమి నేతలు సైతం కల్తీ మద్యాన్ని ప్రోత్సహించడం దుర్మార్గం.

– మట్టా నాగమణి, గుడివాడ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్‌పర్సన్, కృష్ణాజిల్లా

ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నారు



“ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీధి వీధినా బెల్టుషాపులు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం మద్యాన్ని ఆదాయంగా ఎంచుకుంది. పాలకులు ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల సహకారం లేకుండా కల్తీ మద్యం సరఫరా జరగదు. ప్రభుత్వ సహకారంతో కొందరు పెద్దలు ప్రజల సొమ్మును అడ్డదారిలో దోచేస్తున్నారు.

– గుర్రం కుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, కంకిపాడు, కృష్ణాజిల్లా

ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు



“ కల్తీ మద్యంతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలను హరిస్తోంది. నకిలీ మద్యం తయారీ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ చంద్రబాబు గ్యాంగ్ తమ జేబులు నింపుకుంటోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి కల్తీ మద్యం మూలాలను కూకటి వేళ్లతో తొలగించాలి.

– మూల్పూరి హరీష, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు, పెదపారుపూడి



మొవ్వలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, నాయకులు



ఉయ్యూరులో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెడన తహసీల్దార్ వద్ద నిరసన తెలుపుతున్న ఉప్పాల రాము, హారిక తదితరులు

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- మీ–కోసంలో కలెక్టర్ బాలాజీ
- ప్రజల నుంచి 109 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల నుంచి వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో, నాణ్యంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ – కోసం) కార్యక్రమం జరిగింది. కలెక్టర్ బాలాజీతో పాటు జేసీ ఎం.నవీన్, డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి, ఆర్డీఓ స్వాతి, హౌసింగ్ పీడీ పోతురాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ.. కొంత మంది జిల్లా అధికారులు అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు కలెక్టరేట్‌లో నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అధికారులు, సిబ్బందికి గాజు సీసాలతో తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. జేసీ నవీన్ మాట్లాడుతూ.. గత నెల మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో వచ్చిన 22 అర్జీలకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదికలను వెంటనే అందజేయాలని కోరారు. మీ–కోసంలో అధికారులు 109 అర్జీలు స్వీకరించారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ..

- తన తండ్రి బోయిన భద్రాచలం 1.80 ఎకరాల భూమిని సర్వ హక్కులతో అనుభవిస్తున్నారని 2008లో ఆయన మృతి చెందడంతో సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తంలో ఉందని ఆర్‌ఓఆర్ అడంగల్, రెవెన్యూ రికార్డుల్లో తన తండ్రి సోదరుడైన బాబూరావు పేరు నమోదు చేశారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నందివాడ మండలం కుదరవల్లి గ్రామానికి చెందిన బోయిన వెంకటేశ్వరమ్మ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- తమ గ్రామంలో బస్వాని పేరయ్య పేరుతో 46 సెంట్ల ఇళ్ల స్థలం ఉందని, 2013లో బాలకృష్ణకు బస్వాని పేరయ్య రిజిష్టర్ దాఖలు పరిచారని తమకు ఒక్కొక్కరికి 9 సెంట్లు చొప్పున రాయించగా అక్కడ ఇల్లు నిర్మించుకుని ఎవరి స్థలంలో వారు నివసిస్తున్నామని, వీఆర్వో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని కృత్తివెన్ను మండలం గరిశిపూడి చినచందాల గ్రామానికి చెందిన బి.వరలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ



చిలకలపూడి(మచిలీపట్నం): మహిళల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. ప్రభుత్వ వైద్యకళాశాల, సర్వజన ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆయన సోమవారం వీడియోకాన్ఫరెన్స్ హాలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు అల్ట్రాసౌండ్, మామో గ్రామ్ వంటి పరీక్షల కోసం రూ.వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో ఉచితంగా ఈ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఈ వైద్య పరీక్షలు ప్రతి సోమవారం, గురువారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేస్తారని పేర్కొన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం క్షేత్రస్థాయిలో సంచార వాహనం ద్వారా వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏఓ రాధిక, వైద్యులు బి.పద్మావతి, ఇంద్రజ, రేడియాలజిస్ట్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. పాఠశాల ఆవరణ

బంటుమిల్లి: మండలంలోని మల్లంపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా తెరపిలేకుండా వర్షం కురుస్తోంది. సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయానికి ఆవరణ అంతా వర్షపునీరు, మురుగుతో నిండి చెరువును తలపించింది. పాఠశాల స్థలం పల్లంగ ఉండటతో అధిక వర్షం పడితే మురుగు నీరు చేరుతోంది. గతంలో పాఠశాల ఆరణలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు గ్రామ పెద్దలు డ్రెయిన్ ఏర్పాటు చేశారు. ఈ డ్రెయిన్‌ను పాఠశాల చుట్టు ఉన్న స్థానికులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేశారు. దీంతో మురుగునీరు బయటకు చేరే మార్గంలేక పాఠశాల ఆవరణలోనే తిష్టవేస్తోంది. సోమవారం మురుగునీటి కారణంగా ఎదురైన ఇబ్బందులను పాఠశాల కమిటీ చైర్మన్ తమ్ము ఏసుబాబు ద్వారా సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దల దృష్టికి హెచ్‌ఎం మెర్సీ తీసుకువెళ్లారు. పాఠశాల వద్దకు చేరుకున్న సర్పంచ్, పెద్దలు కలసి జేసీబీతో పాత డ్రెయిన్ తవ్వేందుకు సిద్ధమవగా ఆక్రమణదారులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఈ సమస్య మంగళవారం పరిష్కరిస్తామని పెద్దలు హామీ ఇచ్చారు.



మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

వైభవోపేతంగా శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రులోని భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ కనులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా చైర్మన్‌గా వరప్రసాద్



పెడన: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కృష్ణా జిల్లా చైర్మన్‌గా పెడన పట్టణానికి చెందిన మామిడి వెంకట వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పలువురు ప్రసాద్‌ను అభినందించారు. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకుడు, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్న) మామిడి ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

ప్రతి భక్తుడికి సంతృప్తికర దర్శనం లక్ష్యం

- దుర్గ గుడి ఈవో శీనానాయక్
- కార్తిక మాసం, భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే ప్రతి భక్తుడికి దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దర్శనం సంతృప్తికరంగా జరిగేలా చూడాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీ, ఇంజినీరింగ్, ఏఈవోలు, సూపరింటెండెంట్లతో సోమవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో జరిగిన ఈ సమావేశానికి ఆలయానికి చెందిన ముఖ్య అధికారులందరూ హాజరయ్యారు. దసరా ఉత్సవాలలో సిబ్బంది పని తీరు, సహనాన్ని ప్రతి ఒక్కరూ గమనించారని, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో అందరి భాగస్వామ్యం ఉందన్నారు. అదే తీరులో రానున్న కార్తిక మాసం, భవానీ దీక్ష విరమణలలో భక్తులకు మరింత సేవలు అందించాలని సూచించారు. రానున్న ఉత్సవాలలో ఎక్కడ అలక్ష్యం జరిగినా సహించేది లేదన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థాన యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

66 అంశాలపై చర్చ

సమీక్ష సమావేశంలో ఆలయంలో చేపట్టాల్సిన మార్పులు, అభివృద్ధి పనులకు సంబంధించి 66 అంశాలను గుర్తించి, వాటి గురించి చర్చించారు. కనకదుర్గనగర్‌లో దేవస్థానానికి చెందిన భవనాలను కాటేజీలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అన్నదానం, లడ్డూ పోటు, క్యూ కాంప్లెక్స్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. కొండపై దేవస్థానం నిర్వహిస్తున్న గోశాలను భక్తులందరికీ అందుబాటులో ఉండేలా కనకదుర్గనగర్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆలయంలోకి మొబైల్ ఫోన్లతో భక్తులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అంతరాలయంలోకి వచ్చే భక్తులు, ఆర్జిత సేవల్లో పాల్గొనే ఉభయదాతలందరూ తప్పనిసరిగా సంప్రదాయ వస్త్రాలు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో ఏసీ రంగారావు, ఈఈ రాంబాబు, ఏఈవోలు చంద్రశేఖర్, రమేష్‌బాబు, సుధారాణి, గంగాధర్, తిరుమలేశ్వరరావు, శ్రీనివాస్, వైదిక కమిటీ సభ్యులు ఆంజనేయ ఘనాపాటి, శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మీకోసంలో 32 ఫిర్యాదులు

కోనేరుసెంటర్: మీకోసం కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని జిల్లా అడిషనల్ ఎస్పీ వి.వి.నాయుడు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసంలో పాల్గొన్న ఆయన బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీకోసంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఆయన సావధానంగా ఆలకించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్ని ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఫోన్‌లో సిఫార్సు చేశారు.



మీకోసంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ నాయుడు

విద్యార్థులను కొట్టిన ఘటనపై ఎంపీడీఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులపై టీచర్ దాడి చేసిన ఘటనపై ఎంపీడీవో శకుంతల విచారణ చేపట్టారు. ఈనెల 11న 'విద్యార్థులను చితకబాదిన టీచర్' కథనం 'సాక్షి'లో వెలువడింది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ సోమవారం పాఠశాలలో విచారించారు. విద్యార్థులను పిలిపించి టీచర్ కొట్టిన అంశంపై ఆరా తీశారు. టీచర్ చెప్పిన మాట వినలేదని లావు కర్రతో అందరినీ కొట్టిందని ఎంపీడీవోకు విద్యార్థులు తెలిపారు. ఆరోజు తరగతి గదిలో జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్లు విద్యార్థులు వెల్లడించారు. విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయురాలు రజని మాత్రం తాను కొట్టలేదని, పిల్లలు చెప్పేది అంతా అబద్ధమని చెప్పారు. దెబ్బలు తిన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, టీసీలు తీసుకోవద్దని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఎంపీడీవో సూచించారు. పీజీఆర్ఎస్‌లో పెట్టిన ఫిర్యాదుపై మరో విచారణ జరగాల్సి ఉంది. ఎంఈఓ సీహెచ్ పుష్పలత, హెచ్ఎం బేబీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కిలేశపురం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ శకుంతల తదితరులు

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు

మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జెడ్పీ కన్వెన్షన్ హాలులో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో షాపింగ్ ఫెస్టివల్‌ను కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కన్వెన్షన్ హాలులో ఏర్పాటుచేసిన వ్యాపారస్తుల ప్రదర్శనను సందర్శించి ధరల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పన్నుల భారం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగిందన్నారు. 2014లో ఒకే దేశం ఒకే పన్ను విధానంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేసిందని, ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వమే పన్నులు వసూలు చేసి రాష్ట్రాలకు వాటాను పంపిణీ చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీఎస్టీ తగ్గింపుతో రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గిపోతున్నప్పటికీ ప్రజల కోసం తగ్గింపు ధరలను అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ పరికరాలపై కూడా భారీగా ధరలు తగ్గాయన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రతి సామాన్యుడు ఆనందకరమైన జీవనాన్ని గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో–ఆర్డినేటర్ కల్పన, అడిషనల్ కమిషనర్ బాబ్జిబాబు, సీఈవో కన్నమనాయుడు, డెప్యూటీ సీఈవో ఆనందకుమార్, మెప్మా పీడీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ తదితరులు

ఐటీఐలో ప్రవేశానికి అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి ఐదవ విడత అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతితో పాటుగా 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఐటీఐలో ప్రవేశానికి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఐటీఐలో చేరాలనుకునే వారు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఇతర వివరాలకు 0866–2475575, 94906 39639, 77804 29468 నంబర్లల్లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

గుడివాడ ప్రభుత్వ ఐటీఐలో...

గుడివాడరూరల్: గుడివాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ.మంజులాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ విడత దరఖాస్తు చేసుకోవడానికి 10వ తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 16వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీగా పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమతమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 17వ తేదీన కళాశాలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు గుడివాడ ప్రభుత్వ కళాశాలలో డెస్క్‌ను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 08674-295953, 82975 74757, 93461 18232 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

సీజేఐ గవాయ్‌పై దాడి హేయం

చిలకలపూడి(మచిలీపట్నం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ సిద్దెల జయరాజ్ మాదిగ అన్నారు. కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గవాయ్‌పై దాడి చేసిన రాకేష్ కిషోర్ అనే వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పసుమర్తి దినేష్, చిట్టూరి అర్జునరావు, మందా వేణు, మట్టా గోపాలకృష్ణ, కొల్లూరు బసవ, నవీన్ పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి జరగనున్న చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజం ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన జేవీవీ గత 35 ఏళ్లుగా తెలుగు విద్యార్థుల కోసం ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందన్నారు. సైన్స్ పట్ల ఆసక్తిని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ సంబరాలు ఉపయోగపడతాయన్నారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సంబరాలు నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయన్నారు. ఈ సంబరాలలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి బోయి రవి, నాయకులు మురళీమోహన్, వెలగా శ్రీనివాస్, శోభన్ కుమార్, రాజశేఖర్, లెనిన్‌బాబు పాల్గొన్నారు.



చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు

సారూ...మా కాలనీ రోడ్లు బాగు చేయండి!

జగనన్న కాలనీలో రహదారులు బాగు చేయాలని కలెక్టర్‌కు వినతి

జి.కొండూరు: "సారూ...మా కాలనీలో రోడ్లు అధ్వానంగా మారి కాలు బయట పెట్టలేకపోతున్నాం. మురుగునీరు పోయే దారిలేక ఇళ్ల మధ్యలోనే నిలుస్తున్నాయి. ఈగలు, దోమలతో నరక యాతన పడుతున్నాం" అంటూ జి.కొండూరు జగనన్న కాలనీ వాసులు కలెక్టర్ లక్ష్మీశ వద్ద సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులకు కీస్ హ్యాండోవర్ ప్రోగ్రాం నిర్వహణ కోసం జి.కొండూరు జగనన్న కాలనీని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో మహిళలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని తమ సమస్యలను కలెక్టర్ వద్ద ఏకరువు పెట్టారు. వర్షం పడితే బయటకు రావాలంటే నరకం కనపడుతోందని, రోడ్లు బురదతో అధ్వానంగా ఉండడంతో పాఠశాల బస్సులు కాలనీలోకి రావడం లేదని వాపోయారు. జాతీయ రహదారి వరకు బురదలో నడిచి వెళ్లి పిల్లలను బస్సులు ఎక్కించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్యలో మురుగునీరు నిలిచి ఈగలు, దోమలతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు కరెంటు మీటర్ల ఏర్పాటుకు డబ్బులు చెల్లించలేదని, వీధి లైట్లు, పంచాయతీ బోర్లకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. అసలే ఊరికి దూరంగా ఉన్న కాలనీకి వీధిలైట్లు లేకపోతే రాత్రి సమయంలో మహిళలు బయటకు ఎలా రావాలని ప్రశ్నించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలిపివేతపై విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కాలనీలో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయని, ఓపిక పట్టాలని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జి.కొండూరు జగనన్న కాలనీలో సమస్యలను కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న స్థానిక మహిళలు

టెయిల్‌పాండ్ నుంచి 58,122 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 5 క్రస్టుగేట్లు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 58,122 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం తెలిపారు.



బ్యూటీ ప్రాక్టీషనర్, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ వి. అమరేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 35 రోజుల కాల వ్యవధి కలిగిన ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు 19 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన యువతులు, మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లతో పాటు టూల్‌కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్‌తో ఈ నెల 22వ తేదీలోపు విజయవాడలోని ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 63042 54730, 94900 11081, 74161 69916 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం పెంచాలి

కేంద్ర ప్రభుత్వ సలహాదారుపి.సుభాష్ చంద్రబోస్

కోనేరుసెంటర్: ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతూ, ప్రోత్సాహకాలు అందిస్తోందని కేంద్ర ప్రభుత్వ సలహాదారు పి.సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సైన్స్ కాంగ్రెస్, కృష్ణా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, రాడార్ ఎనర్జీల వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించడం, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి సాధించవచ్చన్నారు. ప్రకృతి వనరుల నుంచి సులభంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రత్యామ్నాయ ఇంధన సంస్థల ముఖ్య ఉద్దేశమన్నారు. తొలుత రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ మచిలీపట్నంలో పుట్టి పెరిగిన పి.సుభాష్‌చంద్రబోస్ దేశీయంగా, అంతర్జాతీయంగా చేసిన కృషిని, పొందిన సత్కారాలను విశదీకరించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి పి.వీరబ్రహ్మాచారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తురకపాలెంలో ఎన్‌సీడీసీ బృందం



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం గ్రామంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) బృందం ప్రతినిధులు సోమవారం పర్యటించారు. గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించి ఎస్సీ కాలనీలో ఒక ప్రాంతంలో , విలేజ్ క్లినిక్ ప్రాంతంలో మట్టిని సేకరించారు. బెంగళూరుకు చెందిన బృందంతో పాటు గుంటూరు జిల్లాలోని ఎన్‌సీడీసీకి చెందిన 40 మందికిపైగా పాల్గొన్నారు. అదేవిధంగా నీటి నమూనాలను కూడా సేకరించారు. మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం తీసుకెళుతున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

ఎంఎస్సీ కెమిస్ట్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. 507 మందికిగాను 357 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అలాగే వర్సిటీ అందిస్తున్న డిప్లమో ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కూడా విడుదల చేశారు. 15 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం ఈ నెల 23వ తేదీలోగా పేపరుకు రూ.1860 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

• జంక్షన్ జలమయం

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో హనుమాన్‌జంక్షన్‌లో రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై సుమారు మూడు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో వర్షపు నీరు నిలవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నూజివీడు రోడ్డు, గుడివాడ రోడ్డులో డ్రెయినేజీ పొంగిపొర్లటంతో దుకాణాల్లోకి నీళ్లు వచ్చాయి. విజయవాడ రోడ్డులో వేలేరు క్రాస్‌రోడ్డు నుంచి పాల శీతల కేంద్రం వరకు రహదారి కాలువను తలపించింది. బాపులపాడు, మహాత్మగాంధీ నగర్, తారకరామ కాలనీ, బండారుగూడెం, పెరికీడు గ్రామాల్లోనూ అంతర్గత రహదారులన్నీ జలమయమయ్యాయి.

–హనుమాన్‌జంక్షన్ రూరల్



నీట మునిగిన గుడివాడ రోడ్డు



జలమయమైన హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలి



కాలువను తలపిస్తున్న విజయవాడ రోడ్డు